# జైలు కథలు 21

## "తనవారె పరులైన ...."

"ప్రసాద్ మిమ్మల్ని ఎవరో అమ్మాయి చూడాలంటూంది. వస్తారా?" శాంతయ్య గారి మాటలకు పత్రిక మడిచి, బెడ్ క్రింద పెట్టి గేటు దగ్గరకు వెళ్ళాను. క్షణకాలం నన్ను నేను మరచిపోయాను. లక్ష్మి! ముఖం వాడివుంది. కళ్ళలో దీనత్వం గూడు కట్టుకొని వుంది. వెంట్రుకలు చిందరవందరగా వున్నాయి. నన్ను చూడగానే "అన్నయ్యా" అంటూ అమాంతం నన్ను చుట్టేసింది. దుఃఖం కట్టలు త్రెంచుకుంది. ఏడుపు మధ్య ఎక్కిళ్ళు. విషయం అర్థం కాకపోయినా సముదాయించటం సాధ్యం కాలేదు. ప్రక్కకు తీసికొని వెళ్ళు అన్నట్లు సైగచేశాడు డఫేదారు.

"ఏమైందమ్మా?" అన్నాను అనునయంగా.

"ఇది పొరపాటు కాదన్నయ్యా! నేను క్షమించరాని నీచురాల్ని." ఇంకా ఆమె కళ్ళ వెంట నీళ్ళు కారుతున్నాయి. "ఫరవాలేదు. విషయం చెప్పమ్మా!" అన్నాను. నాకు తెలిసిన విషయాలు మననం చేసుకొంటూ. రమేష్ భార్య లక్ష్మి. ఇద్దరూ చాలా అన్యోన్యంగా వుంటూ, నన్ను చాల ఆదరించేవారు. రమేష్ బావగారూ అనీ, లక్ష్మి అన్నయ్యా అని పిలిచేవారు. రమేష్ చాల సౌమ్యుడు. జాలి, కరుణ అతని సొంతం. చలిచీమకుకూడా హాని చేయటానికి అంగీకరించడు.

అక్కడ నా పని అయిన వెంటనే గది ఖాళీచేసి వెళ్ళిపోయాను. మరలా లక్ష్మిని చూట్టం యిప్పుడే. తరువాత విషయాన్ని లక్ష్మి చెప్పింది.

నేను ఖాళీచేసిన గదిలో చేరాడు అనీల్ కుమార్. మంచి రూపం, మంచి మాటకారి. అతని మాటలు వింటూంటే కాలమే తెలియదు. ఒకసారి ఆఫీస్ పనిమీద ఢిల్లీ వెళ్ళిన రమేష్ వారం రోజులవరకూ రాలేదు. ఆ సమయంలో అనీల్ ప్రలోభంలో పడిపోయింది లక్ష్మి. చాల మంచిపిల్ల వంచింపబడింది. ఆ రోజు సికిందరాబాద్— బెంగుళూరు ఎక్స్‌ప్రెస్‌లో రాత్రి ఒకటిన్నర గంటలకు బండిదిగి ఇంటికి వెళ్ళాడు రమేష్. తలుపుకు తాళం వేసి వుంది. ఎక్కడకు వెళ్ళిందో అర్థంగాక ప్రక్కనే వున్న అనీల్ రూం వేపు నడిచాడు. లైటు వెలుగుతూంది. లోపలనుంచి మాటలు, నవ్వులు వినవచ్చాయి క్షణకాలం నిర్ఘాంతపోయాడు. అనీల్, తన భార్య లక్ష్మిల స్వరాలు గుర్తుపట్టాడు. తలుపు తట్టి పిలిచాడు. అంతే.

మాటలు ఆగిపోయాయి.

గ్రహించలేని అవివేకి కాదు. మరల రైలు స్టేషనుకు వచ్చి, ఆ రాత్రికి అక్కడే పడుకొని వుదయం పది గంటల వేళ యిల్లు చేరాడు. లక్ష్మి ముఖంలో కళాకాంతులు లేవు. మునుపటి వుత్సాహం లేదు. రమేష్‌ను



సాధ్యమైనంతవరకు తప్పుకొని తిరుగుతోంది. అనీల్ రూం ఖాళీ చేసినట్లు తెలుసుకున్నాడు. రమేష్ మాత్రం మామూలుగానే వుంటున్నాడు. లక్ష్మిని ఏమీ అడగలేదు.

కాని తరువాత కూడా లక్ష్మి, అనీల్‌ను రహస్యంగా కలుసుకోవడం రమేష్‌కు తెలిసింది. దీనికి పరిష్కారం ఏమిటి? రెండు రోజులు దీర్ఘంగా ఆలోచించాడు. దృఢ నిశ్చయానికొచ్చాడు. లక్ష్మి అంటే అతనికి ప్రాణం. కలలో కూడా ఆమెకు హాని తలపలేదు. అనీల్ రూంకు వెళ్ళాడు. "లక్ష్మికి దూరంగా వెళ్ళిపో. మా సంసారంలో చిచ్చు పెట్టకు. అది సాధ్యం కాకపోతే మిగిలిన జీవితం లక్ష్మితో పంచుకో" మని అర్థించాడు. "నీ భార్యను అదుపులో పెట్టుకో చేతనైతే"-మనిషిని అర్థం చేసుకోలేని పశువు యిచ్చిన సమాధానం. రమేష్ ఆలోచించాడు మళ్ళీ. 'పోనీ వారి మధ్య నుంచి తనే తప్పుకొంటే'. ఆలోచన వచ్చిన వెంటనే ఎలుకలమందు తాగాడు. చనిపోలేదు కాని ప్రస్తుతం జి. హెచ్.లో స్పృహ లేకుండా వున్నాడు. అనుమానంపై లక్ష్మిని అరెస్టుచేసి కేసు పెట్టారు.

"అన్నయ్యా నేను నీచురాల్ని. దౌర్భాగ్యురాల్ని. ఆయన మనిషి కాదన్నయ్యా. మనుషుల్లో దేవుడు. నన్ను క్షమించి ఇప్పుడు నేనేం చేయాలో చెప్పన్నయ్యా" నిండైన పరివర్తనతో, పరిపూర్ణ పశ్చాత్తాపంతో అడిగిన లక్ష్మిని తేరిచూశాను. ఏం చెప్పేది? ఆలోచిస్తున్నాను. లక్ష్మి తప్పును భర్త క్షమిస్తాడు. స్పృహవచ్చే దాకా ఆగితే....తన తప్పునుంచీ లక్ష్మిబైట పడదా?

—"ప్రసాద్"